

జాయింట్ కలెక్టర్‌గా అపూర్వ భరత్

జెసి రాహుల్ మీనా రాజమహేంద్రవరం కమిషనర్‌గా బదిలీ


అపూర్వభరత్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా అపూర్వ భరత్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అపూర్వ భరత్ ఇప్పటివరకు ఎటపాక సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. అక్కడ నుంచి కాకినాడ జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేసిన రాహుల్ మీనాను రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది.

గూడుకు దూరంగా పేదలు

- -దరఖాస్తుల స్వీకరణకే పరిమితం
- -స్థలాలు ఇవ్వని కూటమి సర్కార్
- -ఆశగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- -వైసిపి పాలనలో ఇళ్లు నత్తనడకనే నిర్మాణాలు


అరకొర నిర్మాణాలకే పరిమితం అయిన కొమరగిరి లే అవుట్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్లను నిర్లక్ష్యం చేస్తుంది. ఇంటి నిర్మాణాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతోంది. అధికారులు సైతం ఇళ్ళ నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గత ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ళు పేరుతో భారీ ఎత్తున స్థలాలను కొనుగోలు చేసి మరీ వేలాదిమంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. అనేక ఇళ్ల నిర్మాణం పూర్తియి వాటిల్లో నివాసం ఉంటున్నారు. కాలనీలు కాదు, ఊళ్ళనే నిర్మించామంటూ గత పాలకులు ఇంటి నిర్మాణాలను చూసి గొప్పలు చెప్పుకున్నారు. అయితే ఎన్నికల అనంతరం చంద్రబాబు సారధ్యంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల గూడు విషయంలో ఎందుకో శ్రద్ధ చూపలేకపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 21 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న జగనన్న హౌసింగ్ కాలనీల్లో గత ప్రభుత్వ హయాంలో పిఎం ఆవాస్ యోజన- వైఎస్ఆర్ (అర్బన్) బిఎల్‌సి పథకం, పిఎం ఆవాస్ యోజన వైఎస్ఆర్ (గ్రామీణ) పథకాల్లో రూ.1361.67 కోట్ల నిధులు విడుదల కాగా 81,325 ఇళ్ళ మంజూరయ్యాయి. వీటిలో 72 శాతం అంటే సుమారు 60 వేలు ఇళ్ల నిర్మాణాలను మాత్రమే ప్రారంభించగా వీటిలో 31 వేల 631 ఇళ్ళు మాత్రమే పూర్తి అయ్యాయి. 22 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలు నేటికీ మొదలు కాలేదు. ప్రభుత్వం ఇచ్చే అరకొర సాయంతో ఇళ్లను లబ్ధిదారులు పూర్తిస్థాయిలో నిర్మించుకోలేకపోతున్నారు. ప్రభుత్వ కేవలం 1.80 లక్షలు మాత్రమే సాయం చేస్తుంది. సెంటున్నర ఇంటి నిర్మాణం పూర్తి కావాలంటే కనీసంగా రూ.15 లక్షల ఖర్చు అవుతున్నట్లు అంచనా. ప్రస్తుతం మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో సగటు మధ్యతరగతి కుటుంబం ఇంటిని నిర్మించుకోవాలంటే అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అయినా సరే అనేకమంది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయగలిగారు.

స్థలాలు ఇచ్చేదెప్పుడు.?

కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోంది. కానీ ఒక్కరికి ఇంటి నిర్మాణానికి సంబంధించి స్థలం కేటాయించిన పాపాన పోలేదు. పైగా ఉన్న స్థలాలలో ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకునే విధంగా ప్రోత్సాహం ఇవ్వడం లేదు. దీంతో పలువురు నిరుపేద లబ్ధిదారులు ప్రభుత్వ స్పందనపై ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే అందరికీ ఇళ్లు పథకంలో పెద్ద ఎత్తున దరఖాస్తులు మాత్రం స్వీకరించి చేతులు దులుపుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, రూరల్ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున స్థలాలను కేటాయిస్తామని, రూ.2.50 లక్షలు సాయంగా ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. పట్టణ ప్రాంతాల నుంచి 17,064 మంది, గ్రామీణ ప్రాంతాల నుంచి 8,600 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. వీరందరికీ కొత్త నిబంధనల ప్రకారం స్థలాలు ఇవ్వాలంటే 598 ఎకరాలు అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారు. గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన లేఅవుట్లలో ఖాళీ స్థలాలను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీల్లో 89 ఎకరాలు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ఇంకా 509 ఎకరాలు భూములను సేకరించాల్సి ఉంది. గత ప్రభుత్వం సుమారు 1500 ఎకరాల భూములను దాదాపు రూ.1300 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది. మార్కెట్ ధర కన్నా ఎక్కువ కొనుగోలు చేసి అప్పట్లో వైసిపి నేతలు భారీగా కమీషన్లు తీసుకున్నారని టిడిపి, జనసేన నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సుమారు 500 ఎకరాల స్థలాలను కూటమి ప్రభుత్వం ఎప్పటికి కొనుగోలు చేస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. కొనుగోలు చేసిన తర్వాత లబ్ధిదారులకు ఎప్పటిలోగా ఇళ్ల స్థలాలను అందజేస్తారనేది స్పష్టత లేదు. ఇప్పటికే ఏడాదిన్నర కాలం కావస్తున్నా ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఇంకా మూడున్నర ఏళ్ల కాలంలో ఈ ప్రక్రియను పూర్తి చేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. కొత్తగా దరఖాస్తులు చేసుకున్న వారికి స్థలాలను ఎప్పటిలోగా ఇస్తారనేది క్లారిటీ లేదు.

వేగం పుంజుకోని నిర్మాణాలు

గత ప్రభుత్వ హయాంలో అనేక ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రభుత్వం కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే సాయం అందించడంతో మిగిలిన సొమ్ము అప్పులు చేసి నిర్మించుకునే పరిస్థితి లేక అనేక నిర్మాణాలు ముందుకు సాగలేదు. దీంతో కూటమి ప్రభుత్వం కేంద్రం నుంచి రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1 లక్ష మొత్తంగా రూ.2.50 లక్షలు ఇంటి నిర్మాణానికి కేటాయిస్తున్నట్లుగా చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన సుమారు 10 వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని అధికారులు ఇటీవల లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు జిల్లాలో కేవలం 4 వేల ఇళ్ళు మాత్రమే పూర్తయ్యాయి. మరో 2 వేల ఇళ్ళు స్లాబ్ స్థాయిలో సుమారు 3 వేలు ఇళ్ళు లింటల్ దశలో ఉన్నాయని అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వేగవంతానికి చర్యలు

జిల్లాలో అందరికీ ఇల్లు పథకంలో భాగంగా నిర్మాణాలను వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకున్నాము. అలాగే సొంతంగా స్థలాలు ఉండి నిర్మించుకునే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాము. అర్బన్ ప్రాంతాల్లో 2,226 మంజూరు అయ్యాయి. ప్రస్తుతం ఇంటింటికీ వెళ్లి జియో ట్యాగింగ్ ప్రక్రియను జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాలలో సుమారు16 వేల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము.

-సత్యనారాయణ, హౌసింగ్ పీడీ


సభలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

ఉసూరనిపించిన డిప్యూటీ సిఎం

-పరిష్కార మార్గం చూపని వైనం-నిరాశలో బాధిత మత్స్యకారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మత్స్యకారులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఆశలు పెట్టుకుంటే చివరకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉసూరుమని పించారు. మూడు నెలలు గడువు కోరి సమావేశం నుంచి దాట వేసినట్లుగా అనిపించింది. దీనిపై అనేకమంది మత్స్యకారులు ఈ సందర్భంగా అసంతృప్తిని వ్యక్తం చేశారు.

ఉప్పాడ కొత్తపల్లి గ్రామంతో పాటు చుట్టు పక్కలనున్న గ్రామాల్లో కొన్ని ఫార్మా పరిశ్రమల కాలుష్యం కారణంగా మత్స్య సంపద దెబ్బ తింటోందని, వేట కష్టం అవుతోందని గత కొద్దిరోజులుగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళనల దృష్ట్యా సమస్యను పరిష్కరించేందుకు, మత్స్యకారుల వేదన వినేందుకు అంటూ వచ్చిన పవన్ కల్యాణ్ తొలిత కలెక్టరేట్‌లో అధికారులతో మత్స్యకార పెద్దలతో సమావేశం అయ్యారు. అనంతరం సాయంత్రం యూ.కొత్తపల్లి మండలం ఉప్పాడ నాలుగు రోడ్ల జంక్షన్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. 20 రోజుల క్రితమే గడువు పెట్టి వస్తానని చెప్పిన ఆయన ఎట్టకేలకు ఉప్పాడకు వచ్చారు. అయితే తమ సమస్యల పరిష్కారానికి ఏదొకటి ప్రకటిస్తారని ఆశిస్తే అందుకు భిన్నంగా పవన్ కల్యాణ్ స్పందించారు. పైగా తన చేతుల్లో ఏమీ లేదని, తన వల్ల ఏమీ కాదన్నట్లుగా ఆయన మాట్లాడిన మాటలు అందరినీ ఆందోళనకు గురి చేశాయి. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉండి సమస్యలు తీర్చాలంటే పరిశ్రమ మంత్రులతో మాట్లాడాలని, మత్స్య శాఖ మంత్రితో మాట్లాడాలి, ఇతర మంత్రులతో మాట్లాడాలి అంతే తప్ప తన ఒక్కడి వల్లే కాదు అన్నట్లుగా ఆయన బాధితులను నిరాశపరిచిన తీరు మత్స్యకారులను ఆచ్చర్యానికి గురి చేసింది. దింతో ఉప్పాడ, ఇతర ప్రాంత మత్స్య కారులు తీవ్ర స్థాయిలో అసంతృప్తికి గురవుతున్నారు. గతంలో పవన్ కల్యాణ్ వచ్చి ఏదో చేస్తారని ఆశిస్తే ప్రస్తుతం అందుకు విరుద్ధంగా ఆయన మాట్లాడిన అంశాలపై మరింతగా ఆగ్రహం పెల్లుబీకుతొంది. దీంతో మరోసారి ఉద్యమించడానికి సన్నాహం కావాల్సిందే అనే మాట కొందరిలో ఈ సందర్భంగా వినిపించింది. ప్రధానంగా ఫార్మా కంపెనీల కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న తమ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకొని అండగా నిలుస్తారని భావించినప్పటికీ నిరాశ మిగిలిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి తానేమీ చేయలేను, వంద రోజులు గడువు ఇస్తే కమిటీని వేసి ఆలోచిస్తాము అంటూ పవన్ దాటవేయడంపై పలువురు మత్స్యకారులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఉప్పాడ తీర ప్రాంత కోత నివారణ విషయంలోనూ ఆయన మాట దాటవేయడంపైనా మత్స్యకారులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా జనసేన పార్టీకి చెందిన ఎంపి త్వరలోనే పనులు మొదలవు తాయంటూ చెప్పారు. కానీ తాజాగా పవన్ కల్యాణ్ మాత్రం అందుకు విరుద్ధంగా మాట్లాడిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. తన ఐదేళ్ల కాలంలో ఎప్పుడో ఒకప్పుడు పూర్తి చేస్తానని, ప్రతి రోజూ ఎంత పని అయింది, పూర్తయిందా అని అడిగితే తాను ఏమీ చేయలేను అన్నట్లుగా చెప్పుకొచ్చారు. దీంతో మత్స్యకార సమస్యలు పేరుకుపో తున్నట్లు భావించాల్సి ఉంటుంది. ఒకవైపు సముద్ర తీర ప్రాంతం కోత, మరో రెండోవైపు కాలుష్యం, మూడవ వైపు ఉపాధి సమస్యలు స్థానిక మత్స్య కారులను తీవ్రస్థాయిలో వేధిస్తున్నాయి.

ముగిసిన పోస్టల్ స్టాంప్స్ పదర్శన

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌టియుకె విసి సిచ్ఎస్‌కె. ప్రసాద్

తపాలా బిల్లల ప్రదర్శన గురువారంతో ముగిసింది. ఎన్నో అత్యద్భుతమైన, అతి ప్రాచీనమైన, వివిధ రకాల మేలైన, అరుదైన స్టాంపుల సేకరణ సమాహారం ఈ ప్రదర్శనలో కన్పించింది. ముగింపు వేడుకలో జెఎన్‌టియుకె విసి చేకూరి శివరామకృష్ణప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఈ ప్రదర్శనలో ఎప్పుడూ చూడని అరుదైన కలెక్షన్స ఉన్నాయని, ఈ తపాలా బిళ్ళల అపురూప ప్రదర్శనను చూసి మంత్రముగ్ధుల య్యారని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగరాజు విద్యార్థులకు పిలాటలీ కళ పట్ల అవగాహన కల్పించారు. ఇటువంటి ప్రదర్శనలు తరచూ నిర్వహిస్తే పిలాటలీ కళ ఎప్పటికీ సజీవంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. న్యాయనిర్ణేతలు అనుప్‌కుమార్‌రౌత్, దేవేందర్ కుమార్‌జైన్ మాట్లాడారు. ఈ ప్రదర్శనలో విజేతలుగా నిలిచిన ఫిలాటలిస్ట్‌లకు, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలలోని విజేతలకు జెఎన్‌టియుకె విసి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

ప్రజాశక్తి - పిఠాపురం, గొల్లప్రోలు


ఎంఇఒకి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

బోధ నేతల పనులను బహిష్కరిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. గురువారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఇఒలు నారాయణదాస్, శ్యాంబాబులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధన సమయం హరించుకుపోతుందన్నారు. ఉపాధ్యాయులకు బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపో యాయని, పలు ధఫాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన 'పోరుబాట' కార్యక్రమంలో బోధనేతర పనులను అక్టోబర్ 10వ తేదీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పప్పు శ్రీనివాస్, డి.ప్రవీణ్‌కుమార్, ఎంవివి.సత్యనారాయణ, ఎస్.సత్యమూర్తి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అలాగే నేటి నుంచి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు గొల్లప్రోలులో ఉపాధ్యాయ సంఘం నేతలు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎంఇఒ-2 బి.శివప్రసాద్‌కు ఫ్యాక్టో అధ్యక్షుడు గడ్డమూరి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మేడతని సత్యనారాయణ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు రమేష్‌బాబు, వివి.జయశంకర్, జిఎస్ఎన్.మూర్తి, సిహెచ్.గంగాధర్, గోవిందరాజులు, అరుణ్‌కుమారి, సురేష్ పాల్గొన్నారు.

ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


ప్రజాశక్తి - గండేపల్లి


డాక్టర్ నిషాకుమారి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ నిషాకుమారి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ రవి తంగజన్ మాట్లాడుతూ గీతం విశ్వ విద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ. బంగార్రాజు పర్యవేక్షణలో నిషాకుమారి సమర్పించిన గ్రంథానికి 'రూరల్ మైక్రో-ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అండ్ మైగ్రేషన్ ఏ స్టడీ ఫ్రమ్ ది ప్రిజం ఆఫ్ ఎంజిఎన్ఆర్ ఇజిఎ'కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ వచ్చిందన్నారు. డాక్టర్ నిషా కుమారి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆదిత్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ రవి తంగజన్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ డీన్ డాక్టర్ బి.సౌజన్య అభినందనలు తెలిపారు.

వైసిపి అధినేత జగన్‌ను కలిసిన వాసిరెడ్డి

ప్రజాశక్తి - రౌతులపూడి


జగన్‌తో వాసిరెడ్డి జమీలు

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం రాత్రి తాడేపల్లిలోని జగన్ స్వగృహంలో కలిసిన జమీలు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని జగన్ తెలియచేసినట్లు ఆయన స్థానిక మీడియాకు గురువారం వివరించారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు, సామర్లకోట


సామర్లకోట మండలంలో తనిఖీ చేస్తున్న అధికారులు

తాళ్లరేవు మండలంలో బాణసంచా తయారీ కేంద్రాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. గురువారం డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబు, కోరంగి పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని బాణసంచా తయారీ కేంద్రాల నిర్వాహకులను అధికారులు హెచ్చరించారు. అలాగే సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రాలను తహశీల్దార్ కె.చంద్రశేఖరరెడ్డి, ఎస్ఐ రమేష్ తనిఖీలు చేపట్టారు. తయారీ కేంద్రాల వద్ద అగ్నిమాపక పరికరాలను వారు ప్రయోగత్మకంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో పెదపూడి మండల తహశీల్దార్ పివి.సీతాపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - జగ్గంపేట


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న సిడిపిఒ పూర్ణిమ

మండలంలోని రాజపూడి, జగ్గంపేట హైస్కూల్లోని కిశోర బాలికలకు గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఎం.పూర్ణిమ మాట్లాడుతూ ఈ నెల 11న బాలిక దినోత్సవాన్ని పురష్కరించుకుని కిశోర బాలికలకు చైల్డ్ రైట్స్, ప్రొటెక్షన్, లింగ వివక్షత, సైబర్ సేఫ్టీ, ఋతు స్రావంలో ఎదుర్కొనే రుగ్మతలు, రక్త హీనత, బాల్య వివాహాలు అంశాలపై పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని 3 మండలాల్లోనూ ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఒకొక్క సచివాలయం పరిధిలో ప్రథమ, ద్వితీయ విజేతలను ఎంపిక చేయడం జరిగిందని, వారికి ఈ నెల 11 బాలల దినోత్సవం రోజున బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కె.సుబ్బారావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అమ్మాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, కృపభాయ్, చంటమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి గ్రామసభలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండల పరిధిలోని శుక్రవారం నుంచి ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సాలేట్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పనులు గుర్తించి ప్రతిపాదించిన పనులను ఆయా గ్రామసభలో ఆమోదించనున్నట్లు తెలిపారు. ఈనెల 30 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ గ్రామ సభలు నిర్వహిస్తామని అన్నారు. ఆయా గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు, సచివాలయం, ఉపాధి హామీ చట్టం సిబ్బంది, కూలీలు పాల్గొంటారని తెలిపారు.

కొంగోడులో పొలంబడి

ప్రజాశక్తి - కరప

మండలంలోని కొంగోడులో గురువారం ఇండి-గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఐ.సత్య పాల్గొని సుడి దోమ నియంత్రణ, సస్యరక్షణ, పురుగుమందుల వినియోగం, భద్రతా నియమాలపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన మందులను పిచికారి చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బండారు శ్రీరాములు, విఎఎ ఆసియా సుల్తానా, రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న గిరిబాబు


మండలంలోని శరభవరం గ్రామ మాజీ సర్పంచ్ అటికే సత్యవతి కుటుంబాన్ని నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. ఇటీవల మాజీ సర్పంచ్ సత్యవతి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో గురువారం ఆమె కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి నాని, రామిశెట్టి దొరబాబు, అమరాధికాశి, గువేరా, రంగనాథం అబ్బాయి పాల్గొన్నారు.

నేడు దిశ సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా అభివృద్ధి సమన్వయం, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుందని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగే ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, సంబంధిత శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

కార్టూ'నిజం'




పోటీలను ప్రారంభిస్తున్న యువ నాయకుడు రంగనాగ్

ప్రారంభమైన క్రీడా పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా పోటీలు గురువారం ప్రారంభం అయ్యాయి. ఈ క్రీడలను ఎంఎల్‌ఎ చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కె.ప్రసూన అధ్యక్షత వహించగా, రంగనాగ్ మాట్లాడారు. క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించి మండలానికి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు బలుసు వాసు, కంటే జగదీశ్ మోహన్, అడబాల కుమార్‌స్వామి, గుమ్మళ్ళ రామకృష్ణ, వల్లూరి దొరబాబు, కౌన్సిలర్ పాలికి కుసుమ, నిమ్మకాయల కిరణ్ కిరణ్, ఎంఇఒలు శివరామకృష్ణ, పుల్లయ్య పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మంత్రి పవన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంఎల్‌ఎ యనమల దివ్య

మత్స్యకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - తుని

పరిశ్రమల రసాయనిక వ్యర్థాల వల్ల సముద్ర సంపదకు ముప్పు ఏర్పడి గంగపుత్రుల జీవనాధారం ప్రశ్నార్థకంగా మారిందని, ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంఎల్‌ఎ యనమల దివ్య కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను కాకినాడలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొండంగి తీరప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సగటున రోజుకు 2 వేల కుటుంబాలు సముద్రంలో ఉన్న చేపల వేట పైనే ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. పరిశ్రమల వ్యర్థాలను సముద్రంలోకి వదిలేయడం వలన మత్స్య సంపద తగ్గిపోయి మత్స్య కారులు జీవనోపాధిని కోల్పోతున్నారని తెలిపారు. మత్స్య కారుల కుటుంబాలను ఆదుకోవల్సిన అవసరం ఉందని ఆమె కోరారు.



సభలో మాట్లాడుతున్న కార్యదర్శి రమణమ్మ

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. గురువారం గాడిమొగలో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అధ్యక్షతన గ్రామ సభలో జరిగింది. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిపై చర్చించారు. విద్యుత్ దీపాలు, శ్మశానాలలో సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, చేసిన ప్రణాళికను కార్యదర్శి రమణమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, టిడిపి గ్రామ కమిటి అధ్యక్షుడు సంగాడి కామేశ్వరరావు, మల్లాడి వరదరాజు, పోతాబత్తుల రాంబాబు, కామాడి మాతరాజు, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


రోడ్డుకు అడ్డంగా ఉన్న కోతులు

భయపెడుతున్న వానరాలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో కోతులు ప్రజలను భయపెడుతున్నాయి. పంట పొలాలను నాశనం చేస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కోతుల బెడదతో మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రైతులు సాగు చేస్తున్న మినుము, పామాయిల్ పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రత్యేకంగా కూలీలను పెట్టుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - కరప

మండలంలోని అరట్లకట్టలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపిడిఒ సలాది వెంకటశ్రీనివాసరావు పరిశీలించారు. ఐవిఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంజీహీరాలాల్, పారిశుధ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డిఎం ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు ఎపిఎస్‌ఆర్‌టిసి డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ ప్రయాణికుల సమస్యలను ఫోను ద్వారా స్వీకరించి వాటి పరిష్కార నిమిత్తం తగు చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం లక్ష్యం అని తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను డిపో మేనేజర్‌కు 9959225535లో తెలియజేయాలని కోరారు.

వసతి గృహాల పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి గురువారం ఎస్‌సి, ఎస్‌టి హాస్టల్స్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. బోధన పద్ధతులు, వసతి సదుపాయాలు, ఆహార నాణ్యత తదితర విషయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకుని మంచి భవిష్యత్తుకు పునాది వేయాలని ప్రోత్సహించారు. క్రమశిక్షణ, సహనశీలత వంటి లక్షణాలను అలవరుచుకోవడం ద్వారా జీవితంలో విజయాన్ని సాధించవచ్చని సూచించారు. వసతి గృహాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా, లేదా న్యాయ సంబంధిత సహాయం అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ హెల్ప్‌లైన్ 15100ను సంప్రదించాలని ఆమె విద్యార్థులకు సూచించారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కడియం

రాష్ట్రవ్యాప్తంగా రూ.కోట్లలో పేద ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతోందని రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన సుమారు రూ.12 లక్షల చెక్కులను మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ముందుగా దుళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎంఎల్ఎ గోరంట్ల సొంత నిధులు రూ.లక్షతో నిర్మించిన షటిల్ కోర్ట్, వాలీబాల్ కోర్టులను ప్రారంభించారు. ఇటీవల ఎపిఐఐసి డైరెక్టర్‌గా నియమితులైన టిడిపి సీనియర్ నాయకులు మార్గాని సత్యనారాయణను ఎంఎల్ఎ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, వెలుగుబంటి నాని, అన్నందేవుల చంటి, ముమ్మిడిదేవి నాగేశ్వరరావు, గుర్రపు సత్యనారాయణ, చిట్టూరి అమ్మిరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని మండలంలోని సర్పంచులు సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలను లేవనెత్తారు. గురువారం గోపాలపురం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆర్.సుజాత అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ మాట్లాడారు. తొలుత మండలంలోని పలు గ్రామాలు సర్పంచులు, ఎంపిటిసిలు గ్రామాల్లోని సమస్యలను లేవనెత్తారు. హౌసింగ్‌కు సంబంధించి ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలన్నారు. కొత్తవి మంజూరు చేయాలని కోరారు. పలు గ్రామాల్లో కొత్త ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలపై సర్పంచులు విన్నవించగా అధికారులు వివరణ ఇచ్చారు.

విజేతలకు మెడల్స్ అందజేత

ప్రజాశక్తి - నిడదవోలు

మండల స్థాయి క్రీడా ఎంపికలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు 350 మందికి సిల్వర్, గోల్డ్ మెడల్స్‌ను నిడదవోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్ ఆర్థిక సహాయంతో అందించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్, అయినీడి పల్లారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గాజుల రంగారావు, ఎండి ఫయాజ్, అడ్డాల సత్య ప్రభాకర్, యాసరపు రామకృష్ణ, పొన్నా సుబ్రహ్మణ్యం సిద్ధాంతి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాల్వలో గుర్తు తెలీని మృతదేహం

ప్రజాశక్తి-పెరవలి

నిడదవోలు-నర్సాపురం మెయిన్ కెనాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పెరవలి లాకుల వద్దకు కొట్టుకు వచ్చింది. మృతుని వయసు సుమారు 45 ఏళ్ల ఉంటుందని, ఎవరైనా మిస్సింగ్ కేసు ఉంటే 9440796642కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ చక్రబంధంలో 'తుని'

రోడ్లపైనే ప్రయివేటు బస్సులు
పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం

ప్రజాశక్తి - తుని

తుని పట్టణం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుపోతుంది. ప్రభుత్వాలు, పాలకులు మారినా పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు సరిహద్దుగా ఉన్న తుని పట్టణం వ్యాపార రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. ఎన్నడూ లేని రీతిలో ఇక్కడ బంగారం, దుస్తులు, మాల్స్, షోరూమ్‌లు, ప్రయివేట్ ఆసుపత్రులు గణనీయంగా పెరుగుతున్నాయి. పట్టణంలో 30 వార్డులు ఉండగా సుమారు 80 వేల నుంచి 90 వేల వరకూ జనాభా నివసిస్తున్నారు. పట్టణం విస్తీర్ణం


ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు

క్రమంగా పెరుగుతూ ఉంది. అయితే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్లను ఆధునికీకరించకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. షాపింగ్ మాల్స్, ప్రయివేట్ ఆస్పత్రుల నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. పార్కింగ్ స్థలాల కేటాయించకుండానే బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. పట్టణంలో ప్రయివేటు, ప్రభుత్వ విద్యాసంస్థల సుమారు 20 నుంచి 25 వరకు ఉన్నాయి. ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యను అభ్యసించడానికి గ్రామీణ ప్రాంతాల నుంచి ఉన్నత చదువుల కోసం పెద్దఎత్తున విద్యార్థులు తరలివస్తున్నారు. విద్యార్థులను తరలిస్తున్న ప్రయివేటు విద్యా సంస్థల బస్సులు అధికంగానే రాకపోకలు సాగిస్తున్నాయి. ఆయా స్కూల్స్ బస్సులను రోడ్లపైన నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. రోగులు, గర్భిణులు, ఆసుపత్రికి వచ్చే అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్న సందర్భాలు లేకపోలేదు.

ఇక్కడ ప్రయాణం ప్రమాదభరితం

పట్టణంలోని గొల్ల అప్పారావు సెంటర్ నుంచి ఎల్‌ఐసి భవనం వరకూ, గొల్లప్రోలు సెంటర్ నుంచి పెంటకోట రోడ్డు వరకూ, తుని -పాయకరావుపేట కూడలి వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. వీధి రోడ్లను ఆనుకొని ఉన్న నివాస గృహాలను షాపింగ్ కాంప్లెక్స్‌గా ఆధునికీకరించడంతో వీధి రోడ్లపై నడవడానికి అనుకూలంగా లేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు ఇరుకగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యతోపాటు, ప్రమాదాలు అధికంగానే జరుగుతున్నాయి.

ఆచరణకు రాని రోడ్ల విస్తరణ

గతంలో రోడ్ల విస్తరణకు, వన్ వే మార్గాన్ని ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. అయితే ఆ ప్రణాళికలు ఆచరణ రూపం దాల్చడం లేదు. దీంతో పట్టణంలో రామా టాకీస్, గొల్ల అప్పారావు సెంటర్, గర్ల్స్ హైస్కూల్ సెంటర్ వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆఖరికి ఆయా సెంటర్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల ఆధునికీకరణతోపాటు, ట్రాఫిక్‌కు అంతరాయంగా మారిని ప్రయివేటు విద్యా సంస్థల బస్సులను రోడ్లపై నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. షాపింగ్ మాల్స్, ఆసుపత్రిలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసేలా ఆయా యాజమాన్యాలు చర్యలు తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్లను వెడల్పు చేయాలి



పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రోడ్లను ఆధునికీకరించాలి. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వన్ వే రహదారి విధానాన్ని ఏర్పాటు చేయాలి. దీనిపై ప్రజాప్రతినిధులతోపాటు, మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

-నక్కల శ్రీనివాస్, మండల కార్యదర్శి, సిపిఎం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ అధికారి ప్రవీణ్, జెవివి ప్రతినిధులు

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యానాం

జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్సు సంబరాలకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో విద్యాశాఖ అధికారి పంపన ప్రవీణ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా పర్యావరణ కమిటీ కన్వీనర్ డాక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక 35 సంవత్సరాలుగా విద్యార్థుల్లో సైన్స్, చదువు పట్ల అసక్తి, శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించుటకు కృషి చేస్తుందన్నారు. చెకుముకి సైన్సు మాసపత్రికను నడుపుతుందన్నారు. ప్రతి సంవత్సరం నాలుగు స్థాయిల్లో చెకుముకి సైన్సు సంబరాలు నిర్వహిస్తుందని తెలిపారు. యానాం కమిటీ అధ్యక్షులు ఆనాల వీర భద్రరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో అక్టోబర్ 18, బ్లాక్ లెవెల్ నవంబర్ 1, జిల్లా స్థాయిలో నవంబర్ 23, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. గౌరవాధ్యక్షులు దాట్ల దేవదానంరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెసల జయరామయ్య, కాశి కరుణ, శాస్త్రి, యానాం కార్యకర్త టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీ వైదిలింగంను కలిసిన బలరాం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఎంపీ వి.వైదిలింగంను విశ్రాంత పుదుచ్చేరి అండర్ సెక్రటరీ గిడ్డి బలరాం కలిశారు. ఈ సందర్భంగా దరియాలతిప్పలో ఒఎన్‌జిసి పైప్‌లైన్ లీక్ అయిన ఘటన నేపథ్యంలో నష్టపోయిన అందరికీ తగిన నష్టపరిహారం వెంటనే అందించాలని ఎంపికి వినతిపత్రాన్ని అందజేశారు. తొలుత గిడ్డి బలరాం, సబ్బతి శ్రీనివాస్ ఎంపీని శాలువాతో సత్కరించారు.

సిజెఐపై దాడికి నిరసన

ప్రజాశక్తి - యానాం

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఎస్‌సి, ఎస్‌టి యునైటెడ్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. గురువారం స్థానిక బుద్ధా పార్కు ప్రాంగణంలో జరిగిన నిరసన కార్యక్రమంలో నాయకులు న్యాయమూర్తిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో పొనుగుమట్ల విష్ణుమూర్తి, నామాడి అప్పారావు, గిడ్డి బలరాం, పండు సిద్ధార్థ కుమార్, తిరుకోటి నాగేశ్వరరావు, పోలుమారి సత్యనారాయణ, యడ్ల కుటుంబరావు, సబతి శ్రీనివాసు, పువ్వుల వెంకట్రావు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాల పేటలో బుధవారం జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి వరదరాజన్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కనకాలపేటలో పాత స్కై విజన్ రోడ్‌లో బుధవారం ఉదయం కిల్లి షాప్ నిర్వహిస్తున్న నల్ల శేషరత్నకుమారి మెడలో నుంచి రచ్చవారిపల్లి సుభాష్ చంద్రబోస్ అనే వ్యక్తి బంగారపు శతమానాలతో ఉన్న నల్లపూసల తాడును బలవంతంగా లాగి పట్టుకుని పారిపోయాడు. దీనిపై వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐలు పునీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేయడంతోపాటు, 38 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని త్వరితగతిన అరెస్టు చేసిన పోలీసులను ఆయన అభినందించారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

నేటి నుంచి జిల్లాలో బోధనేతర, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ కాశీ విశ్వనాథ్ తెలిపారు. గురువారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, డిఇఒ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి జిల్లా లోని అన్ని పాఠశాలల్లో బోధనేతర పనులు అన్నింటినీ పూర్తిగా బహిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించటానికి కృషి చేస్తామని, గూగుల్ షీట్ సమాచారం పంపడం, ఆన్‌లైన్


డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

సమావేశాలు మొదలైన బోధనేతర పనులు అన్నింటినీ బహిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు సిహెచ్.సూరిబాబు, మోర్తా శ్రీనివాస్, డివిఎస్.రాజు, యు.శ్రీను, పి.రామకృష్ణ పాల్గొన్నారు.



తునిలోని మమత ఆసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న జిఎస్‌టి అధికారులు

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - యంత్రాంగం

తుని స్థానిక మమత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో జిఎస్‌టి తగ్గింపుపై అవగాహనా సదస్సు జరిగింది. నిత్యవసరాలు, మందులపై తగ్గిన జిఎస్‌టి వివరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మమత ఆసుపత్రి యాజమాన్యం, అధికారులు పాల్గొన్నారు. **కరప** స్థానిక పిహెచ్‌సిలో ఎంపిడిఒ సలాది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిఎస్‌టి తగ్గింపుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. జిఎస్‌టి అధికారులు పాల్గొని జిఎస్‌టి తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిర్మలాదేవి, జనసేన పార్టీ నాయకుడు భోగిరెడ్డి కొండబాబు, సొసైటీ అధ్యక్షుడు ఎస్.భవానిశంకర్, ఆసుపత్రి సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని తిరుపతి, దివిలి గ్రామాల్లో జిఎస్‌టి తగ్గింపుపై ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్, ఆయా గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీలలో ఇంజరం హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్ గురువారం తెలిపారు. రెజ్లింగ్, బేస్ బాల్‌లో అండర్ 14 బాలుర విభాగంలో జె.పూర్ణ సాయిరాం ఎంపిక కాగా, బాలికల విభాగంలో లక్ష్మీప్రసన్న ఎంపికయింది. అండర్ 17 బాలుర విభాగంలో బీచ్ వాలీబాల్, రెజ్లింగ్, పెంటాతలాన్ పోటీల్లో ఎం.సునీల్‌కుమార్, స్విమ్మింగ్‌లో రోషన్‌జాన్ జిల్లా స్థాయికి



క్రీడాకారులను అభినందిస్తున్న స్కూల్ సెక్రటరీ

ఎంపికయ్యారని హైస్కూల్ పీడీ రేకాడి దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను, పీడీ దుర్గాప్రసాద్‌ను స్కూల్ గేమ్స్ సెక్రటరీ శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్ అభినందించారు.

చేగువేరాకు ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఆర్థిక తార తమ్యాలు, ఏకస్వామ్య పెట్టుబడుదారి వ్యవస్థ, నూతన వలస విధానం వంటి వ్యవస్థలపై తిరుగుబాటు చేసిన విప్లవకారుడు చేగువేరాకు ఘనంగా నివాళులర్పించారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో చేగువేరా వర్ధంతి గురువారం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ జీవితాంతం కవిత్వం పట్ల భావోద్వేగాలు కలిగి ఉండేవారన్నారు. ప్రపంచ స్థాయి విప్లవ రాజనీతివేత్తగా చేగువేరా ఎదిగారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టర్ శిరీష, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌కు సన్మానం

ప్రజాశక్తి - రౌతులపూడి

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఎర్ర శ్రీనివాసును గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గంటి మల్ల రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ శివరామకృష్ణయ్య సన్మానించారు విద్యార్థులు విద్యతోపాటు, సామాజిక అంశాలపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సతీష్, ఉప విద్యాశాఖ


ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఎంపిపి రాజ్యలక్ష్మి

అధికారి గాడి కొండబాబు, ఉపాధ్యాయులు హరిబాబు, లాలం రమణ పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - తాళ్లరేవు

జిఎస్‌టి తగ్గింపుతో కలిగే ప్రయోజనాలపై ఈ నెల 10, 11 తేదీల్లో ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండంలోని కోరంగి పంచాయతీ సీతారామపురం ఎంపిపి పాఠశాలలో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో వ్యాపార సంస్థల ఆధ్వర్యంలో వివిధ రకాల వస్తువుల విక్రయాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనను ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ప్రారంభిస్తారని తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని సిడిపిఒ పూర్ణిమ అన్నారు. గురువారం స్థానిక సచివాలయం-2లో గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిన్న వయసులో వివాహాలు చేయురాదని, అటువంటివి జరిగితే తమ దృష్టికి


చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సిడిపిఒ

తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంను కలిసిన సత్యప్రభ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ గురువారం కాకినాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం నుంచి జె. అన్నవరం రహదారి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.


మంత్రిని కలిసిన ఎంఎల్ఎ

కళ్లజోళ్లు, దుస్తుల అందజేత

ప్రజాశక్తి - కాకినాడ

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డే సందర్భంగా గురువారం స్థానిక లయన్స్ క్లబ్ హాల్‌లో లయన్స్ బాదం బాలకృష్ణ క్లాత్, ఐ గ్లాస్ ప్రాజెక్ట్ ద్వారా పేదలకు ఉచితంగా కళ్ళజోళ్లు, దుస్తులు అందించారు. ఈ సందర్భంగా మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ దృష్టి ప్రాజెక్టులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి వందేళ్లు పైనే అవుతుందన్నారు. దృష్టి ప్రాజెక్ట్ ద్వారా పేదలకు కళ్ళజోడులు అందించడం లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిసి.జగన్నాధరావు, డి.రామసుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల జెసిగా కాకినాడ కమిషనర్ భావన

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావనను బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు.


పిఎంపి వైద్యుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘీయులు

పిఎంపి వైద్యునికి నివాళి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పిఎంపి వైద్యుడు, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొప్పాడి శివప్రసాద్‌కు పలువురు నివాళులర్పించారు. గురువారం పిఎంపిల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన సంస్మరణ సభ స్థానిక లయన్స్ క్లబ్‌లో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పిఎంపి వైద్యునిగా ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా మెడికవర్ హస్పటల్ సిబ్బంది పిఎంపిలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌కె.ఫరీజ్, సూర్యారావు, కెఎస్ఎన్.బాబు, సిహెచ్.శ్రీనివాస్, అత్తిలి శ్రీనివాస్, కొప్పుల బాలరాజు, ఆర్.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



తాళాలు వేసివున్న రైతు సేవా కేంద్రం

నిరుపయోగంగా ఆర్‌ఎస్‌కె

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కృష్ణాపురంలోని రైతు సేవా కేంద్రం-2 నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను నిర్మించింది. ఆ భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. అయితే నాటి నుంచి నేటి వరకూ ఆ భవనం వినియోగానికి మాత్రం నోచుకోవడం లేదు. ఈ భవనం వద్దకు అధికారులెవ్వరూ విధులు నిర్వర్తించకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. విష సర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.